క్లుప్తంగా

మిగిలిపోయిన సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

సి.బెళగల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతికి సంబంధించి మిగిలిపోయిన సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థులకు ఈ నెల 26న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని సి.బెళగల్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బలరాముడు తెలిపారు. గురుకుల పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశ పరీక్ష రాసి సీట్లు రాని విద్యార్థులకు వారుపొందిన మార్కుల ఆధారంగా 1:3 నిష్పత్తిలో ఈనెల 26వ తేదీ చిన్నటేకూరులోని గురుకుల కళాశాలలో సీట్లను కేటాయిస్తామన్నారు. ఎస్సీ విద్యార్థులు ప్రవేశ పరీక్షలో 44 నుంచి 23 మార్కులు, ఎస్టీ విద్యార్థులు 40 నుంచి 25, బీసీ విద్యార్థులు 47 నుంచి 45, ఓసీ విద్యార్థులు 46 నుంచి 44, బీసీ–సీ విద్యార్థులు 17 నుంచి 14 మార్కులు పొందిన వారు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ప్రిన్సిపాల్ తెలిపారు. పూర్తి వివరాలకు స్థానిక పాఠశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

గడ్డివామి దగ్ధం


మంటలను అదుపు చేస్తున్న గ్రామస్తులు

కోడుమూరు రూరల్: కోడుమూరులోని కోటవీధిలో నాగిరెడ్డికి చెందిన గడ్డివామి దగ్ధమైంది. శనివారం కొందరు ఆకతాయిలు గడ్డివామికి నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు బిందెలతో నీళ్లు చల్లుతూ మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న కోడుమూరు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అగ్ని ప్రమాదంలో రూ.15వేలు విలువ చేసే గడ్డివామి కాలిపోయిందని.. నష్టపోయినట్లు బాధితుడు నాగిరెడ్డి వాపోయాడు.

ఓటు హక్కుపై అవగాహన


గడివేములలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

గడివేముల: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని గడివేముల ఎంపీడీఓ శివరామిరెడ్డి పిలుపునిచ్చారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా శనివారం తహసీల్దార్ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ సూచనలు తప్పకుండా పాటించాలన్నారు. ఓటర్లను మద్యం, డబ్బుతో ప్రలోభాలకు గురిచేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటే ఆయుధం


అవగాహన ర్యాలీలో మాట్లాడుతున్న సెక్టోరల్ అధికారి

పాణ్యం: ప్రజాస్వామ్యంలో ఓటే ఆయుధమని.. ఓటు ద్వారా మంచి నాయకుడిని ఎన్నుకోవాలని సెక్టోరల్ అధికారి సుబ్రమణ్యం అన్నారు. శనివారం మండలంలోని ఆలమూరు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు వేయాలని కోరారు. వయోవృద్ధులు, దివ్యాంగులకు ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం కల్పించినట్లు తెలిపారు. వంద శాతం పోలింగ్ జరిగేలా కృషి చేస్తున్నామని చెప్పారు. అందరూ బాధ్యతాయుతంగా ఓటు వేయాలన్నారు.

23న వీర హనుమాన్ విజయ శోభాయాత్ర


మాట్లాడుతున్న వీహెచ్‌పీ నాయకులు

కర్నూలు కల్చరల్: బలోపాసన్ దివస్‌ను పురస్కరించుకొని ఈనెల 23వ తేదీన వీరహనుమాన్ విజయ శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ పేర్కొన్నారు. శనివారం వినాయక్ ఘాట్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హనుమజ్జయంతి సందర్భంగా వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ సంయుక్త ఆధ్వర్యంలో శోభా యాత్రను నిర్వహిస్తున్నామన్నారు. సాయంత్రం 4.30 గంటలకు పాతబస్తీ జమ్మిచెట్టు సమీపంలోని లలితా పీఠం వద్ద ప్రారంభమై చిత్తారి వీధి, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ కూడలి, గడియారం ఆస్పత్రి, పెద్ద మార్కెట్, పాతబస్టాండ్ అంబేడ్కర్ కూడలి, కోట్ల కూడలి, గోశాల, స్వామి వివేకానంద కూడలి (రాజ్ విహార్) మీదుగా బుధవారపేట ఓంసాయి శ్రీ సీతారామాంజనేయస్వామి ఆలయం వరకు సాగుతుందన్నారు.

పేదల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ లక్ష్యం

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి


ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: రాష్ట్రంలో పేదలకు సంక్షేమం, విద్య, వైద్యం అందించటడమే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని దూపాడు, పెద్దటేకూరు, తడకనపల్లె, వామసముద్రం, ఓబులాపురం, తండా గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఆయా గ్రామాల్లో స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో పేదలు అనారోగ్యం పాలైతే అప్పులు చేసి కుటుంబ సభ్యలను కాపాడుకోవాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఆ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.5 లక్షల ఉంచి రూ. 25లక్షల వరకు పెంచామని చెప్పారు. మనబడి నాడు–నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి కార్పొరేట్ పాఠశాల స్థాయిలో తీర్చిదిద్దామని తెలిపారు. పిల్లలను బడికి పంపే తల్లుల ఖాతాలో అమ్మ ఒడి పథకం కింద ఏడాదికి రూ. 15వేలు ఆర్థికం సహాయం జమ చేస్తున్నామన్నారు. మే 13న జరగనున్న సార్వత్రి ఎన్నికల్లో పాణ్యం ఎమ్మెల్యేగా తనను, నంద్యాల ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మనందారెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయా గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనుల గురించి వివరిస్తూ ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మునిస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు హనుమంతురెడ్డి, మహేష్, చంద్రారెడ్డి, పెద్ద ఈశ్వరయ్య, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి, కృష్ణరెడ్డి, వెంకటేశ్వరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ పాణ్యం నియోజకవర్గంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరికలు భారీగా జరుగుతున్నాయి. శనివారం కల్లూరు అర్బన్ పందిపాడుకు చెందిన 40 టీడీపీ కుటుంబాలు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. పార్టీ నాయకులు కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, టీయూసీ భీమేష్‌రెడ్డి, రవి ఆధ్వర్యంలో ప్రసాద్ చౌదరి, భవాని భాయ్, 400 కుటుంబాల కార్యకర్తలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే కాటసాని వైఎస్సార్‌సీపీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఐదేళ్ల కాలంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రతి గడపకు సంక్షేమ పథకాల వల్ల లబ్ధి చేకూరిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు.

కోర్కెలు తీర్చే కోన వెంకన్న

- నేడు గరుడ సేవతో స్వామివారి ఉత్సవాలు ప్రారంభం


ఆలయ మార్గంలోని ఆర్చి


శ్రీదేవి, భూదేవి సమేత కోన వేంకటేశ్వరస్వామి

సి.బెళగల్: మండలం పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామంలో కొండపై కొలువైన కోన వేంకటేశ్వరుడు కొలిచిన వారికి కొంగు బంగారంగా విరాజిల్లుతున్నాడు. నేటి(ఆదివారం) నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తొలి రోజు గరుడ సేవతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఐదు రోజుల పాటు వివిధ సేవలు నిర్వహించనున్నారు.

ఆలయ చరిత్ర

కోన వేంకటేశ్వరుని కొండపై ప్రతిష్ఠించడంలో ఒక కథ ప్రచారంలో ఉంది. తెలాంగాణ ప్రాంతానికి చెందిన కొందరు కోడుమూరు మండలంలోని కొండరాయుని కొండపై ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని అపహరించి సంచిలో తీసుకెళ్తుండగా చీకటి పడడంతో స్థానిక కొండపై విశ్రమించారు. తెల్లవారిన తరువాత విగ్రహాన్ని తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా విగ్రహం బరువు పెరిగి ఎంతకీ రాకపోవడంతో స్వామివారిని అక్కడే ఉంచి వెళ్లారు. అక్కడికి వచ్చిన గొర్రెల కాపర్లు సంచిలో స్వామిని గుర్తించి స్థానికంగా ప్రతిష్ఠించి గుడి నిర్మించి పూజలు చేయడం ప్రారంభించారని కథ ప్రచారంలో ఉంది.

పర్వదినాల్లో విశేష పూజలు

ఆలయంలో ప్రతి శనివారం ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దసరా, ఉగాది పర్వదినాల్లో ఉత్సవాలు, ముఖ్యంగా తొలిఏకాదశి, ముక్కోటి ఏకాదశి, తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించడం ఇక్కడ విశేషం. స్వామివారి ఆలయానికి మండలంలోని సి.బెళగల్, బురాన్‌దొడ్డి, గొల్లలదొడ్డి, పోలకల్, కంబదహాల్, సంగాల, ఇనగండ్లతో పాటు కోడుమూరు, గోనెగండ్ల, ఎమ్మిగనూర్, గూడూరు గోనెగండ్ల మండలాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి దర్శించుకుంటారు. తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. వివాహ వేడుకలు జరుగుతాయి.

ఐదు రోజుల పాటు ఉత్సవాలు

క్రోధినామ సంవత్సరం చైత్ర శుద్ధ త్రయోదశి ఆదివారం సాయంత్రం స్వామి వారికి గరుడోత్సవం, 22వ తేదీ కల్యాణోత్సవం, అదే రోజు రాత్రి 2:06 గంటలకు స్వామివారి ప్రభోత్సవం జరుగుతుంది. 23వ తేదీ మహా ఘటాభిషేకం, రథాంగ హోమం, పుర్ణాహుతి, గణపతి పూజ, కుంభం అనంతరం 24వ తేదీ తెల్లవారుజామున 3:55 నుంచి 5:25 గంటలకు మహా రథోత్సవం నిర్వహించనున్నారు. అదే రోజు అశ్వ, గజ వాహనం సేవ, పారువేట, 25వ తేదీ వసంతోత్సవం, చక్రస్నానం జరగనుంది. 26వ తేదీ పాల పండ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు ఉంటాయి.

చురుగ్గా ఆలయ పునర్నిర్మాణ పనులు

కొండపై ఆలయ పునర్నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. సి.బెళగల్ మండలం ఈర్లదిన్నె గ్రామానికి చెందిన ప్రతాప్‌రెడ్డి, సరస్వతమ్మ దంపతుల కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డి, సుజాత దంపతులు రూ.6 కోట్ల అంచనాతో ఆలయ పునర్నిర్మాణానికి పూనుకున్నారు. కొండపైకి రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి.


స్వామివారి రథం

అన్నదాన కార్యక్రమం

ఉత్సవాలు జరిగే రోజుల్లో భక్తులకు స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆలయ నిర్వాహకులు, దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అగ్నిమాపక సిబ్బంది సేవలు గొప్పవి


మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్

కోడుమూరు రూరల్: అగ్ని ప్రమాదాలను నివారించి ప్రజల ప్రాణాలను, ఆస్తులను కాపాడుతున్న అగ్నిమాపక సిబ్బంది సేవలు ఎంతో గొప్పవని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక అగ్నిమాపక కేంద్రంలో శనివారం గ్యాస్ లీకేజీ, ఎలక్ట్రికల్ వల్ల కలిగే అగ్ని ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏఈ ప్రసాద్ మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదాల నివారణకు అగ్నిమాపక సిబ్బంది నిర్వహిస్తున్న సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకుని ప్రమాదాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం గ్యాస్ ప్రమాదాలు చోటు చేసుకుంటే తీసుకోవాల్సిన నివారణ చర్యలపై అగ్నిమాపక ఎస్‌ఐ మహబూబ్ దౌలత్ మహిళలకు వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది తిమ్మోజీ, వీరాంజనేయులు, రఘురాముడు, గిడ్డయ్య, అనీల్, బ్రహ్మేశ్వర్, లక్ష్మన్న పాల్గొన్నారు.

నేడు మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

సి.బెళగల్: స్థానిక మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశ పరీక్షను ఆదివారం నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ వంశీ మోహన్ తెలిపారు. పాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న 144 మంది అభ్యర్థులకు ఆరు గదులను కేటాయించామని చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. విద్యార్థులు హాల్‌టికెట్‌తో ఉదయం 9:30 గంటల్లోపు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని పేర్కొన్నారు.

వలంటీర్ల రాజీనామా

ఓర్వకల్లు: వలంటీర్ల రాజీనామాల పర్వం కొనసాగుతోంది. శనివారం మండలంలోని కాల్వ గ్రామానికి చెందిన వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ మల్లీశ్వరికి అందజేశారు. మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలనే ఉద్దేశంతో తమ పదవులకు స్వచ్ఛందంగా రాజీనామా చేసినట్లు తెలిపారు.


ఎంపీడీఓకు రాజీనామా పత్రాలు సమర్పిస్తున్న వలంటీర్లు

9 మంది వలంటీర్లు రాజీనామా

గడివేముల: మండల పరిధిలోని బూజునూరు గ్రామానికి చెందిన 9 మంది వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు. ఎంపీడీఓ శివరామిరెడ్డికి రాజీనామా పత్రాలను అందజేశారు. స్వచ్ఛందంగా రాజీనామాలు చేసినట్లు వారు తెలిపారు. పేదలకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు అందించామన్నారు. ప్రజలకు మంచి జరగాలన్నా, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా మరోసారి జగనన్నే ముఖ్యమంత్రి కావాలన్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు.


రాజీనామా పత్రాలను ఎంపీడీఓకు అందజేస్తున్న వలంటీర్లు


కల్లూరు: రాజీనామా చేసిన వలంటీర్లు

కల్లూరు: మండలంలోని ఎ.గోకులపాడు గ్రామానికి చెందిన 12 మంది వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో అధికారులకు రాజీనామా పత్రాలను అందజేశారు. ఎవరి ప్రోద్బలం, ప్రోత్సాహంతో రాజీనామాలు చేయడం లేదని, స్వచ్ఛందంగా చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల అభ్యున్నతి కోసం పని చేస్తున్నారని చెప్పారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అధికారంలోకి వస్తే వలంటీర్లకు నెలకు రూ. 10వేలు ఇస్తానన్న హామీపై నమ్మకం లేదన్నారు.


కుడా చైర్మన్ కోట్ల హర్ష, సతీష్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న వర్కూరు టీడీపీ నాయికులు

రానున్నది జగనన్న ప్రభుత్వమే

- కుడా చైర్మన్ హర్షవర్ధన్, ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్

కోడుమూరు రూరల్: రానున్నది జగనన్న ప్రభుత్వమేనని, ప్రజలంతా మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా చేసేందుకు సిద్ధంగా ఉన్నారని కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్ అన్నారు. శనివారం కర్నూలులో కోడుమూరు మండలం వర్కూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు రామకృష్ణారెడ్డి, సోమశేఖరరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన నాగేశ్వరరెడ్డి, రమణారెడ్డి, పాపిరెడ్డి, సికిందర్‌రెడ్డి, నరేంద్రరెడ్డి, మాదన్న, మద్దిలేటి, హుసేన్, దేవదానం, దాసుతో పాటు 30 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో పార్టీలకతీతంగా ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ప్రజలంతా తమకు మేలు చేసిన జగనన్నను మరోసారి ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ చంద్రబాబు మాయమాటలు చెబుతూ ప్రజలను మోసం చేయాలని చూస్తున్నాడని, గత ఎన్నికల్లో మాదిరి ఈ ఎన్నికల్లో కూడా చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో కోడుమూరు జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్ రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, క్రిష్ణాపురం సర్పంచ్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కోడుమూరు గడ్డ.. వైఎస్సార్‌సీపీ అడ్డా

- నిడ్జూరు గ్రామంలో జోరుగా ఇంటింటి ప్రచారం


నిడ్జూరు గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

కర్నూలు (సిటీ): కోడుమూరు నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్‌ను గెలిపించి హ్యాట్రిక్ సాధించి కోడుమూరును వైఎస్సార్‌సీపీకి అడ్డాగా మారుద్దామని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం కర్నూలు రూరల్ మండల పరిధిలోని నిడ్జూరు గ్రామంలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ప్రతి గడపలో ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. సంక్షేమ పథకాలతో తమ జీవితాలు మారాయని.. ఆర్థికంగా నిలదొక్కుకున్నామని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేసిన ఏకైక నాయకుడు జగనన్న అని, ఆయన ఇచ్చిన పథకాలతో లబ్ధి పొందిన తాము ఎన్నికల్లో ఆయన నిలబెట్టిన అభ్యర్థులకు ఓట్లు వేసి జగనన్న రుణం తీర్చుకుంటామని మహిళలు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్, కుడా చైర్మన్ హర్ష మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం వల్ల మేలు జరిగి ఉంటేనే ఓటు వేయమని చెప్పిన దమ్మున్న నాయకుడు జగనన్న మాత్రమేనని అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన ప్రతి సంక్షేమ కార్యక్రమం పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసమేనని పేర్కొన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఏ సంక్షేమ పథకం కావాలన్నా జన్మభూమి కమిటీలకు మామూళ్లు ఇచ్చుకోవాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు, సేవలు తీసుకొచ్చిందని తెలిపారు. అనారోగ్యానికి గురైతే పట్టణానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా గ్రామంలోనే వైద్య ఆరోగ్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. ఈ ఎన్నికలు పేదల కోసం పరితపిస్తున్న నాయకత్వానికి, పేదలను విస్మరించే నాయకత్వానికి మధ్య జరుగుతున్నాయని, ఓటు వేసే ముందు ఒక్క నిమిషం ఆలోచించి వేయాలని కోరారు. ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థిగా సతీష్, ఎంపీ అభ్యర్థిగా బీవై రామయ్యను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ప్రసన్నకుమార్, వైస్ ఎంపీపీ నెహెమ్యా, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు డి.వాసు, పార్టీ మండల కన్వీనర్ మహబూబ్ బాషా, సింగిల్ విండో చైర్మన్ శేషిరెడ్డి, నిడ్జూరు సర్పంచ్ మాధవి, నాయకులు సత్యం రెడ్డి, శ్రీనివాసరెడ్డి, పోలకల్ ప్రభాకర్‌రెడ్డి, సంపత్, ఉల్చాల సర్పంచ్ విద్యాసాగర్, ఆదాం, వెంకటేశ్వరరెడ్డి, చిన్నలక్ష్మన్న, వెంకటేశ్వర్లు, సాయన్న, మధు, రవిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, మహేశ్వరరెడ్డి, సురేష్, వెంకటేష్, పసుపుల శేఖర్, ఎదురూరు వెంకటేశ్వర్లు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్యాలకుర్తిలో ఎన్నికల ప్రచారం

కోడుమూరు రూరల్: మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో ఆదివారం ఉదయం వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ రమేష్‌నాయుడు తెలిపారు. కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్‌తో పాటు కోడుమూరు జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, ఎంపీపీ గాడి రూతమ్మ, సింగిల్‌విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి పాల్గొంటారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

కబడ్డీ విజేతలకు బహుమతుల ప్రదానం


విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

పాణ్యం: దస్తగిరిస్వామి ఉరుసు సందర్భంగా మండల పరిధిలోని ఎస్.కొట్టాల గ్రామంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో విజేతలకు శనివారం బహుమతులు అందజేశారు. మొదట స్థానం సాధించిన ప్యాపిలి జట్టుకు రూ. 50 వేలు నగదు బహుమతి అందజేశారు. అలాగే రెండో బహుమతి మిషన్ ప్రకాశం జిల్లా రూ. 35 వేలు, మూడో బహుమతి ప్రకాశం జిల్లా రూ.20 వేలు, నాల్గో బహుమతి హెతర్ జూయిర్ రూ.15 వేలు, ఐదో బహుమతి తొగర్చేడు రూ. 10వేలు, ఆ తర్వాత వరుసగా తమిళనాడు రూ. 6వేలు, బాబోలు రూ. 4 వేలు, బుగ్గానిపల్లె రూ. 2 వేలు అందుకున్నాయి. ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయని నిర్వాహకులు తెఇపారు.

పత్రికా ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా, మా క్లయింట్ అయిన బైరెడ్డి సుభాష్ రెడ్డి తండ్రి బి.జగన్మోహన్ రెడ్డి, మునగాలపాడు గ్రామం, కర్నూలు జిల్లా, నంద్యాల జిల్లా, డోన్ మండలం, డోన్ గ్రామం నందు నివాసముంటున్న పింజరి మానుంవలి, తండ్రి పింజరి దస్తగిరి గారికి డాక్యుమెంట్ నెం. 513/2024 పై రిజిష్టర్ కాబడిన దిగువ షెడ్యూల్ దాఖలలో చూపబడిన స్థలమును మా క్లయింట్ అయిన బైరెడ్డి సుభాష్ రెడ్డి గారు కొనుగోలు చేయుచున్నారు. సదరు భూమిపై ఎవరికైన ఎలాంటి హక్కులు, వివాదాలు, వగైరాలు ఉన్న ఈ పత్రిక ప్రకటన అనంతరం అనగా 22.04.2024 సాయంత్రం 5.00 గంటలలోగా తెలుపగలరు. అట్లు తెలుపని యెడల విక్రయం/ రిజిస్ట్రేషన్ తరువాత పరిగణలోకి తీసుకోబడదని మనవి.

షెడ్యూలు: కర్నూలు ఆర్.డి. కోడుమూరు స.డి. కోడుమూరు మండలం, ఎర్రదొడ్డి గ్రామం ఆస్తి వివరం. సర్వే రుష్పుంజి. స.నెం. 264–ఎ, పూ.వి. 7–60, పైకి ఎ.4–60, హెక్టార్లు 1–863. ఈ సర్వే నెంబరుపైకి నాలుగు ఎకరాల అరవై సెంట్లు గల భూమి యిందుకు చెక్కుబంది.

తూర్పు: తిప్పన్న భూమి, పడమర: రస్తా మరియు అక్బర్ వలి భూమి మరియు సుభాన్ భూమి, ఉత్తరం: ఈడిగె నాగన్న భూమి, దక్షిణం: మిన్నెల్ల వుశేన్ భూమి.. ఈ హద్దులకు లోనైనది.

బి.శ్రీకాంత్, అడ్వకేట్,
సెల్: 99633 68611